సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 21 । జూన్ । 2023



కొనసాగుతున్న రద్దీ

వేములవాడ: ఆషాఢమాసం ఆరంభమైనా రాజన్న చెంతకు భక్తులు తరలివస్తున్నారు. సోమవారం స్వామివారిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు.



హెల్తా.. ఎలక్షన్ సర్వేనా..?

కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ కళాశాల విద్యార్థులు మండుటెండలో సర్వే చేపట్టడం చర్చనీయాంశమైంది. ఇంటింటా తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. వడ గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఆరోగ్య మహిళ'కు స్పందన



వేములవాడ పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈసందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 410, బ్రెస్ట్ 410, ఆర్‌సీఎగ్జామినేషన్ 310 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవేకాకుండా యూటీఐ 7, ల్యాబ్ 100, థైరాయిడ్ 65, విటమిన్ డి 47, సీబీపీ 84, సూక్ష్మ పోషకాలకు సంబంధించి 68 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 12 మందిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

నేరెళ్లలో అడిషనల్ డీఆర్‌డీవో పర్యటన



లక్ష్మిని పరామర్శిస్తున్న మదన్‌మోహన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల గ్రామంలో మంగళవారం అడిషనల్ డీఆర్‌డీవో సీహెచ్ మదన్‌మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ, కంపోస్టు షెడ్డు పరిశీలించారు. అనంతరం ఇటీవల ఉపాధి హామీ పనులు చేస్తూ కంటికి గాయమై ఆపరేషన్ చేసుకున్న కూలీ గజ్జెల లక్ష్మి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎంపీడీవో పి.లచ్చాలు, ఏపీవో రాపోలు నాగరాజు, కార్యదర్శి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజన్న క్షేత్రంలో ఆధ్యాత్మిక దినోత్సవం

వేములవాడ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఉదయం ప్రాతఃకాలపూజ అనంతరం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, వేద పారాయణము, ఉదయం 7.30 గంటలకు రుద్రహోమము, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా రాజన్న ప్రసాదం అందజేస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అష్టావధానం, రాత్రి 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు, స్థానికులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మందు పొయ్య.. పైసలియ్య..

- ఇక్కన్నే ఉంటా.. పని చేస్తా
- 57 ఏళ్లలో ఏ ప్రభుత్వాలు పట్టించుకోలే
- తొమ్మిదేళ్లలో అభివృద్ధి చేసి చూపించాం
- ఎవరో వచ్చి మాట్లాడితే ఆగం కావద్దు
- మంత్రి తారకరామారావు

సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల అర్బన్: తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. అయినా ఎవరో వచ్చి ఏదో చెబితే ఆగం కావద్దు.. గతంలో ఎట్లుండే.. ఇప్పుడెలా ఉందో ఆలోచించాలే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కాలేజీ, వంద పడకల ఆస్పత్రి కావాలని అంటున్నారని కేటీఆర్ అన్నారు. 12 కిలోమీటర్ల దూరంలోనే 350 పడకల ఆస్పత్రి ఉందని, ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ‹మీ దయ ఉంటే ఎమ్మెల్యే అయితా.. నేను మాత్రం ఎన్నికల్లో మందు పొయ్య.. పైసలు ఇయ్య. ఇక్కడే ఉంటా ఇక్కడే పని చేస్తా. ప్రజలు ఆశీర్వదించి ఓట్లేస్తే సేవ చేస్తానని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట వేదికగా మంత్రి కేటీఆర్ మాటలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

'సర్కారు బడి.. సరికొత్త ఒరవడి'.. పాటల సీడీని మంత్రి సిరిసిల్లలో ఆవిష్కరించారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి సంయుక్తంగా రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. డీపీఆర్వో ఎం.దశరథం పర్యవేక్షణలో గడ్డం శ్రీనివాస్ రాసిన పాటలకు కాయితోజు ప్రవీణ్ సంగీతం అందించారు. కొడిమోజు లక్ష్మీనారాయణ, గడ్డం శ్రీనివాస్ పాటలను ఆలపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

ధూప్‌స్టిక్స్ అమ్మకాలు ప్రారంభం

సిరిసిల్లటౌన్: శ్రీనిధి మహిళా స్లమ్ సమాఖ్య సభ్యులు తయారు చేసిన ధూప్‌స్టిక్స్ అమ్మకాలను మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వాడిన పూలు, ఆవునెయ్యి, ఆవుపేడ, గుగ్గిళం మేళవింపుతో తయారు చేస్తున్నట్లు తయారీ దారులు మంత్రికి తెలుపగా అభినందించారు.

బడి, గుడిని బాగుచేశాం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గత 57 ఏళ్లలో ఏ ప్రభుత్వాలు ప్రజల గోసలను పట్టించుకోలేదని, తొమ్మిదేళ్లలో బడి, గుడి బాగుచేశామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో



సిరిసిల్లలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

రూ.8.50కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీకృత నూతన భవన సముదాయాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల క్రితం విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాలు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లుందో బేరీజు వేసుకోవాలన్నారు. మల్కపేట రిజర్వాయర్ రెండు పంపుల ట్రయల్‌రన్ పూర్తయిందని, తొందరలోనే సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మల్కపేట నీళ్లతో సింగసముద్రం నింపి సాగునీటిని అందిస్తామన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్

విద్యతోనే వికాసం, అభివృద్ధి జరుగుతుందని, తరగతి గదులు దేశ భవిష్యత్‌కు విజ్ఞాన ఖనులు అని మంత్రి అన్నారు. ఒక తరం చదువుకొని ముందుకుపోతే భవిష్యత్ బంగారమయమవుతుందన్నారు. రాష్ట్రంలోని 26 వేల స్కూళ్లకు టీఫైబర్ బ్రాడ్‌బాండ్ వ్యవస్థతో పాఠాలు బోధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలోచనలతో జిల్లాలోని 60 పాఠశాలల్లో 12 వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ చాంప్స్ పేరుతో బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని తెలిపారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే ఆడపిల్ల ఆత్మరక్షణకు ఎస్పీ అఖిల్ మహాజన్ చేపట్టిన కార్యక్రమం సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు.

దమ్ముంటే అభివృద్ధి చేసి చూపించాలి

'మాటలు కాదు, విమర్శలు వద్దు.. కేంద్రంలో అధికారంలో ఉన్నారు.. దమ్ముంటే ఈ ప్రాంతంలో మాకంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాలి. తొమ్మిదేళ్లలో జిల్లాకు 22 రకాల కాలేజీలు తీసుకొచ్చాం.. మీకు దమ్ముంటే కనీసం రెండు కాలేజీలు తెచ్చి మాట్లాడాలి'అని మంత్రి సవాల్ విసిరారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు వారి మాటల గారడీకి ఆందోళనలు చేస్తూ, పర్యటనలను అడ్డుకుంటూ ఏదో సాధించామనుకుంటే పొరపాటన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క పైసా తీసుకురాకుండా చిల్లరమాటలు మాట్లాడడం సరికాదన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ మందాటి రాజు రోడ్డు ప్రమాదంలో వారం క్రితం మృతిచెందగా.. కుటుంబ సభ్యులను మంగళవారం మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజు భార్య రమ్యకు ఉద్యోగం కల్పిస్తామని, ఇల్లు కూడా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రాజు మరణం పార్టీకి తీరని లోటన్నారు. పిల్లల చదువులకు సహకరిస్తామన్నారు.

కార్యక్రమాల్లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీలు చీటి లక్ష్మణ్‌రావు, కొమిరెడ్డి విజయ, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీపీ అంజ కరుణ, ఎంపీటీసీలు నాగరాజు, అనసూయ, అంజిరెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, హెచ్ఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



గోరింటాలలో మాట్లాడుతున్న మంత్రి తారకరామారావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రానికే ఆదర్శంగా గంభీరావుపేటలో నిర్మించిన కేజీ టు పీజీ విద్యా సంస్థలకు అనుబంధంగా త్వరలో శాశ్వత హాస్టల్ ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎస్సీ, బీసీ హాస్టళ్లను తాత్కాలికంగా ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. గోరింటాలలో మనఊరు–మన బడి కార్యక్రమంలో నిర్మించిన అదనపు తరగతి గదులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గోరింటాల హైస్కూల్‌కు మరో నాలుగు అదనపు తరగతి గదులు మంజూరు చేసి నాలుగైదు నెలల్లో అందుబాటులోకి తెస్తామని, అదనపు టీచర్ల నియామకం చేపడుతామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలన్నారు. దశల వారీగా నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో సర్కారు బడులను తీర్చిదిద్దుకొని ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు.

కత్తెర లేక రిబ్బన్ పీకేసిన మంత్రి

గోరింటాల ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవం కోసం తలుపులకు రిబ్బన్ కట్టారు. కానీ సమయానికి కత్తెర అందుబాటులో లేకపోవడంతో కాసేపు వేచి ఉన్న మంత్రి రిబ్బన్‌ను చేతులతో పీకేశారు.



ఎల్లారెడ్డిపేటలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న వినోద్‌కుమార్



సిరిసిల్లలో వాలీబాల్ అకాడమీ క్రీడాకారులతో మంత్రి కరచాలనం

మంత్రి గారూ.. ఆలకించరూ..



పౌర సంక్షేమ సమితి సభ్యుల నిరసన

సిరిసిల్లటౌన్: అంతిమ సంస్కారాల నిర్వహణలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడానికి మంత్రి కేటీఆర్‌ను అధికారులు కలవనివ్వడం లేదని పౌర సంక్షేమ సమితి నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం పద్మనాయక కల్యాణ మంటపంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వస్తే అడ్డుకున్నారని వారు ఆరోపించారు. కరీంనగర్‌లో అంతిమ సంస్కారాలకు మున్సిపల్ రూ.1 మాత్రమే బాధితుల నుంచి వసూలు చేస్తుందన్నారు. మంత్రి కేటీఆర్ కూడా సిరిసిల్లలో ఆ పద్ధతిని అమలు చేయాలని కోరారు. సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, కుసుమ గణేష్, దేవదాసు, విష్ణు ఉన్నారు.

చిరు వ్యాపారిపై అధికారుల ప్రతాపం



బాధితులు

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ పర్యటనలో మున్సిపల్‌శాఖ ఓ చిరు వ్యాపారిపై వీర ప్రతాపం చూపించడం మంగళవారం సిరిసిల్లలో ఆందోళన రేకెత్తించింది. బాధితులు, స్థానికుల వివరాలు.. పట్టణంలోని విద్యానగర్‌లో శ్రీనివాస్ దంపతులు చాలా రోజులుగా బజ్జీల కొట్టు నడుపుతూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. మంగళవారం మంత్రి పర్యటన స్థానిక పద్మనాయక కల్యాణ మంటపంలో ఉండగా, మున్సిపల్ సిబ్బంది హఠాత్తుగా శ్రీనివాస్ హోటల్ వద్దకు వచ్చి ఫుట్‌పాత్‌పై ఎందుకు వ్యాపారం చేస్తున్నావంటూ బండిపై ఉన్న సామాన్లను విసిరేశారు. వద్దని బతిమిలాడినా వినలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే ఏరియాలో కొందరు తనలా వ్యాపారం చేస్తుంటే తమనే టార్గెట్ చేశారని వాపోయారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కమిషనర్‌ను బీజేపీ నాయకులు కోరారు.

నేడు వేములవాడ కోర్టులో యోగా దినోత్సవం

వేములవాడ: వేములవాడ సబ్‌కోర్టులో ఉదయం 7 నుంచి 7.45 గంటల వరకు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్ మంగళవారం ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌కోర్టు జడ్జి రవీందర్ హాజరవుతారని పేర్కొన్నారు. అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

అద్భుతం.. ఆకర్షణీయం

- రెడీ అయిన కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి
- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- అంతర్జాతీయ ప్రమాణాలతో తీగల వంతెన
- వెలుగులు విరజిమ్మనున్న డైనమిక్ లైటింగ్
- ప్రతీ ఆదివారం వాహనాలకు నోఎంట్రీ
- నగరవాసుల ఉల్లాసం కోసమే: మంత్రి గంగుల
- రేపటి నుంచి నిర్వహణ అంతా కార్పొరేషన్‌దే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న తీగల వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న కేబుల్ బ్రిడ్జిని బుధవారం మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించనున్నారు. సాయంత్రం నుంచి ఈ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించనున్నారు. వాస్తవానికి గత ఏప్రిల్ 14న వంతెన ప్రారంభించాలి. కానీ.. పనులు పూర్తికాకపోవడం.. ఓ సభలో మంత్రి కాలికి గాయంకావడం తదితర కారణాలతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ.. పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా రు. రెండు రోజుల పాటు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించాలని మంత్రి గంగుల కమలాకర్ నిర్ణయించారు.

నగరవాసుల కోసం..

జిల్లా పర్యాటకంలో కలికితురాయిగా నిలిచే కేబుల్ బ్రిడ్జిని తొలుత నగరవాసులకు పరిచయం చేయాలని మంత్రి గంగుల కమలాకర్, జిల్లా అధికారులు నిర్ణయించారు. స్థానికులు వంతెనపై అటూఇటూ సంచరించేందుకు వీలుగా ప్రతీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వాహనాలకు అనుమతి నిలిపివేశారు. పర్యాటకులను రంజింపజేసేలా మ్యాజిక్ షో, మ్యూజిక్ షో, కళకారుల ఆటాపాటలు తదితర వినోద కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధంచేశారు. రకరకాల ఫుడ్‌కోర్టులు ఏర్పాటుచేయనున్నారు. దాదాపు దసరా పండుగ వరకు కుటుంబాలతో వచ్చి సరదాగా గడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. వంతెన వద్ద కొరియా సాంకేతికతతో రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

నేపథ్యమిదీ..

వరంగల్ – కరీంనగర్ నగరాల మధ్య దాదాపు 7. కి.మీల దూరం తగ్గించడం, హైదరాబాద్–కరీంనగర్ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకుంది. 2018లో రూ.180 కోట్ల అంచనా బడ్జెట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు తీగల వంతెన తర్వాత తెలంగాణలో రెండో బ్రిడ్జి కరీంనగర్‌దే కావడం విశేషం. పూర్తిగా విదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన వంతెన నాణ్యతను ఆర్ అండ్ బీ అధికారులు పలుమార్లు పరీక్షించారు.

రేపటి నుంచి కార్పొరేషన్ నిర్వహణ..

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న తీగల వంతెన నిర్వహణ బాధ్యతలు గురువారం నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ కరీంనగర్(ఎంసీకే) చేతుల్లోకి వెళ్లనుంది. వంతెనపై లైటింగ్, పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ తదితరాలు ఇకపై బల్దియా చూసుకుంటుంది. రెండేళ్లపాటు వంతెనకు సంబంధించిన సాంకేతికపరమైన నిర్వహణను మాత్రం ఆర్ అండ్ బీ అధికారులు చూస్తారు. అంతేకాకుండా వంతెనపై రెండు భారీ పిల్లర్ల అంచున నాలుగు ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయనున్నారు. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు ప్రకటనలు ప్రదర్శించనున్నారు.

బ్రిడ్జి విశేషాలు..

- 500 మీటర్ల పొడవైన రోడ్డు, ఫోర్‌లేన్
- ఇటలీ నుంచి తెప్పించిన 26 పొడవైన స్టీల్ కేబుల్స్
- వంతనకు రెండు పైలాన్లు.. వీటి మధ్యదూరం 220 మీటర్లు
- పైలాన్ నుంచి ఇంటర్ మీడియన్‌కు దూరం 110 మీటర్లు
- రూ.180కోట్ల బడ్జెట్.. పూర్తిగా అధునాతన ఇంజినీరింగ్
- రూ.8 కోట్లతో కొరియా డైనమిక్ లైటింగ్ సిస్టమ్
- వెడల్పు 21.5 మీటర్లు, ఒక్కోటి 7 మీటర్ల వెడల్పుతో రెండు దారులు
- రోడ్డుకు ఇరువైపులా 2.5మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు
- టాటా కంపెనీ సారథ్యంలో నిర్మాణం
- 2017 డిసెంబర్‌లో నిర్మాణానికి శంకుస్థాపన
- 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం
- 2023 జనవరి 26న వంతెనపై పనుల కోసం వాహనాలకు అనుమతి
- 2023 జూన్ 21న వంతెన ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న కరీంనగర్‌లోని తీగలవంతెన

కేటీఆర్ పర్యటన సాగనుందిలా..

కేబుల్ బ్రిడ్జితోపాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న మున్సిపల్, ఐటీ మినిస్టర్ కె.తారకరామారావు బుధవారం సాయంత్రం 5 గంటలకు రూ.10 కోట్లతో కశ్మీర్‌గడ్డలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 5.05 గంటలకు రూ.7 కోట్లు వెచ్చించి నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.2 కోట్ల వ్యయంతో సిటిజన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించనున్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐసీసీ వీడియో వాల్ కంట్రోల్ రూం, 14 జంక్షన్ల ఆటోమేటెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం (ఏటీసీఎస్), 18 చోట్ల ఏర్పాటు చేసిన పబ్లిక్ అంద్రసింగ్ సిస్టం(పీఏఎస్), 8 చోట్ల వేరియబుల్ మెసేజింగ్ సిస్టం, ఐదుచోట్ల వాతావరణ సూచికలు, 18 ప్రాంతాల్లో వైఫై హాట్‌స్పాట్లు, ఘన వ్యర్థాల నిర్వహణను మంత్రి ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు కమాన్‌మీదుగా ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వెళ్లి కేబుల్ బ్రిడ్జి ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన డైనిమిక్ లైటింగ్ సిస్టమ్‌కు స్విచ్ఛాన్ చేయనున్నారు.

పర్యాటక కేంద్రంగా..



కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని టూరిజం స్పాట్‌గా నిలపాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనల్లో భాగంగానే తీగల వంతెన ఏర్పాటైంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆయనకు కరీంనగర్ మీద ఉన్న మమకారం అలాంటిది. రూ.180 కోట్ల వ్యయంతో కేబుల్ బ్రిడ్జి, రూ.410 కోట్లు వెచ్చించి మానేరు పరీవాహక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మానేరు రివర్ ఫ్రంట్(ఎంఆర్ఎఫ్) ప్రాజెక్టును మంజూరుచేశారు.

– మంత్రి గంగుల కమలాకర్

డిగ్రీ కాలేజీ అడిగితే అరెస్టులా?



పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరితే.. మంత్రి కనుసన్నల్లో పోలీసులు ప్రతిపక్షాల నాయకుల నోరు నొక్కుతున్నారని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచే కాంగ్రెస్, బీజేపీ, ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్లారెడ్డిపేటలో ఏటా 1,600 మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకొని స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక, ఆర్థికభారంతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. కళాశాలతోపాటు స్థానిక సమస్యలపై ప్రతిపక్షాలు శాంతియుతంగా మంత్రిని కలిసి విన్నవించకుండా పోలీసులు అరెస్టులకు పాల్పడడం అన్యాయమన్నారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, బానోతు రాజు, ఏబీవీపీ, బీజేపీ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో లాండ్రీ టేల దగ్ధం



కాలిపోతున్న టేల

వేములవాడఅర్బన్: మండలంలోని రుద్రవరం గ్రామంలో నేరళ్ల బాలయ్యకు చెందిన లాండ్రీ టేల షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికుల వివరాలు.. టేల పైన ఉన్న విద్యుత్ వైర్లు గాలికి రాపిడి జరిగి నిప్పురవ్వలు పడటంతో మంటలు చెలరేగాయి. మంటలకు టేలలోని గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్ గ్యాస్ పేలాయి. దీంతో టేలలోని వస్తువులు, బట్టలు, ఫ్రిజ్, పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు ఫైర్‌ఇంజన్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు బాలయ్య వేడుకుంటున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్ శ్రీకాంత్‌పై ఓ యువకుడు దాడి చేసిన ఘటనపై సిరిసిల్ల డిపో కంట్రోలర్ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. ముస్తాబాద్ నుంచి సిరిసిల్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ఓ యువకుడు బైక్‌పై వచ్చాడు. ఇదేంటని డ్రైవర్ శ్రీకాంత్ యువకుడిని ప్రశ్నించగా, ఆగ్రహించిన యువకుడు డ్రైవర్‌పై దాడి చేశాడు. ముస్తాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, విచారణ చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల నారాయణ కూతురు ఎర్ర లత(25) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు.. లతను కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్ర రామకృష్ణకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. కాగా లత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, సిరిసిల్లలోని ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు గత ఆదివారం తండ్రి నారాయణ స్వగ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తమ వ్యవసాయ పొలం వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు కడుపునొప్పి భరించలేకనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలాన్ని ఏఎస్సై మోతీరామ్ సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు సహన్‌రెడ్డి ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని ఏరియా ఆసుపత్రి ఎదుట వేములవాడ– సిరిసిల్ల రహదారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని జగిత్యాలకు చెందిన వావిలాల దేవేందర్, వావిలాల ప్రవీణ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. యువకులిద్దరూ తిప్పాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్దకు కుటుంబ సభ్యులతో వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

శివ శివా..

- రాజన్న చెంత.. అసౌకర్యాల చింత
- రంగుమారిన కోనేరు'
- దుర్వాసనతో భక్తుల ఇబ్బందులు

వేములవాడ: తెలంగాణ ప్రజల ఇలవేల్పుగా కొలువబడుతున్న ఎములాడ రాజన్న సన్నిధిలో భక్తులకు అసౌకర్యాల చింత నెలకొంది. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో అలయ అధికారులు విఫలమవుతున్నారని భక్తులు మండిపడుతున్నారు.



ర్యాంప్‌లేక తిప్పలు

రాజన్న గుడి చెరువులోని పార్కింగ్ స్థలానికి చేరుకునేందుకు గతంలో ర్యాంప్ ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు తమ వాహనాల పార్కింగ్ ప్రదేశానికి సులువుగా చేరుకునేవారు. అయితే ఇటీవల చేపట్టిన రోడ్డు పనుల కారణంగా ర్యాంప్‌ను తొలగించారు. రోడ్డు పనులు పూర్తయినా ర్యాంపు ఏర్పాటు చేయడంలేదంటూ భక్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి భక్తులకు ఇబ్బంది కలగకుండా ర్యాంప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పాకురుపట్టి.. పచ్చగా మారి

ఎములాడకు చేరుకునే భక్తులు ముందుగా ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి తర్వాత కల్యాణకట్టలో తలనీలాలు, తడి బట్టలతో రాజన్నకు కోడె ఇతర మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ధర్మగుండం వారం రోజులుగా పాకురుబట్టి నీళ్లన్నీ పచ్చగా మారాయి. అయినా ఆలయ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. మంగళవారం ధర్మగుండం ప్రాంతానికి ముక్కు మూసుకుని వెళ్లాల్సి వచ్చిందని వరంగల్‌కు చెందిన రాజేశ్, హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, హన్మకొండకు చెందిన దేవేందర్‌రెడ్డి, సికింద్రాబాద్‌కు చెందిన శైలజ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూల్చారు.. వదిలేశారు



నిత్యం వేలాది మందితో కిటకిటలాడే రాజన్న ఆలయం ప్రాంతంలో ఇటీవల రాజేశ్వరపురం వసతి గదులను కూల్చి చిత్తడిని రోడ్డుపైనే వదిలేశారు. దీంతో భక్తుల కాళ్లకు గాయలవుతున్నట్లు పేర్కొంటున్నారు. పెద్ద బండరాళ్లు, ఇనుప చువ్వలు రోడ్డుపైనే ఉండగా, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజన్నకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ఇలాంటి పనులు చకచకా నిర్వహించకుండా భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు సత్వరం స్పందించి రహదారిపై చిత్తడిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నురగనీరు.. భక్తుల బేజారు

ధర్మగుండంలోని నీళ్లన్నీ పాకురుతో పచ్చబడిపోవడంతో పాటు దుర్వాసన వస్తుండడంతో మంగళవారం నీటిని బయటకు పంపించే కార్యక్రమానికి ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే పంపింగ్ చేసే ప్రాంతంలో నీళ్లన్నీ నురగతో వస్తుండడంతో భక్తులు దుర్గంధం భరించలేక అక్కడి నుంచి పరుగులు తీశారు. అధికారులు ఎప్పటికప్పుడు ధర్మగుండంలో శుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.



హెల్తా.. ఎలక్షన్ సర్వేనా..?

- మండుటెండలో వివరాల సేకరణ

రుద్రంగి(వేములవాడ): కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు మండుటెండలో సర్వే చేపట్టడం చర్చనీయాంశమైంది. యాజమాన్యం ఆదేశాల మేరకు సోమవారం నుంచి రుద్రంగి మండలంలో హెల్త్ సర్వే పేరుతో ఇంటింటా తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. కాగా వీరు అడుగుతున్న ప్రశ్నలకు గ్రామస్తులు ×ఇది హెల్త్ సర్వేనా లేక ఎలక్షన్ సర్వేనా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రశ్నలకు కొందరు పీజీ విద్యార్థులు సమాధానం చెప్పలేక, యాజమాన్యం ఆదేశాలను కాదనలేక కంటనీరు పెట్టుకున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో వేములవాడ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచే అభ్యర్థుల్లో పోటీ, ఆశావహులు, బీఆర్‌ఎస్, మరో పార్టీ సీటు కేటాయింపు విషయంలో కొన్ని రోజులుగా వేములవాడ తరచూ వార్తల్లో వినిపిస్తూ రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారింది. కాగా వచ్చే ఎన్నికల్లో ఇక్కడినుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తాడనే ప్రచారంలో ఉన్న వ్యక్తి ఈ సర్వే చేయిస్తుండడంతో ఇది హెల్త్ సర్వేనా లేక ఎలక్షన్ సర్వేనా అనే సందేహం ప్రజల్లో కలుగుతోంది.



వివరాలు సేకరిస్తున్న విద్యార్థులు

ఎం చేయాలి.. ఎం చేస్తున్నారు..?

ప్రజలకు వైద్య సేవలు అందించాలంటే గ్రామాల్లో హెల్త్ క్యాంపులు పెట్టాలి. ఇటు విద్యార్థులకు అటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. కానీ ఇలా పీజీ విద్యార్థులను మండుటెండలో గ్రామంలోని కాలనీల వెంట తిప్పుతూ సర్వే చేయించడం ఏమిటని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కాగా సదరు విద్యార్థులు యాజమాన్యం ఆదేశాలను ఎదిరించలేక సర్వే చేయక తప్పడం లేదని వాపోతున్నారు.

అనుమతి ఇవ్వలేదు

గ్రామాల్లో హెల్త్ సర్వేకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ముున్ముందు మంచి డాక్టర్లు అయ్యే పీజీ విద్యార్థులను అలా రోడ్ల వెంట తిప్పడం సరికాదు. పీజీ విద్యార్థులు సర్వే చేయాల్సిన అవసరం కూడా లేదు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు పెట్టి వైద్య సేవలు అందించాలి అంతే.

– డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

గురుకులం పేరిట బెదిరింపు

సిరిసిల్లఎడ్యుకేషన్: తంగళ్లపల్లి మండలంలోని మైనార్టీ గురుకులంలో పాత పుస్తకాలు, సామగ్రిని అనుమతి లేకుండా అమ్మినట్లు మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా కథనంపై అదే గురుకులానికి చెందిన వ్యక్తి 'సాక్షి'కి ఫోన్ చేశాడు. పై అధికారుల ఆదేశాలతో అమ్మకాలు జరిపినట్లు వివరిస్తూ, వార్తను ఎందుకు ప్రచురించారని బెదిరించేందుకు ప్రయత్నించాడు. అమ్మకానికి పైఅధికారులు ఇచ్చిన లిఖితపూర్వక ఆదేశాలను చూపాలని విలేకరి కోరగా.. అవన్నీ కంప్యూటర్ మెయిల్‌లో ఉన్నాయని బుకాయించేందుకు ప్రయత్నించాడు. కానీ అమ్మకాలకు సంబంధించిన అనుమతి పత్రాలను మాత్రం అందించలేదు. జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు అనుమానిత వ్యక్తులతో ఫోన్ చేయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య



చిన్నారులతో ముచ్చటిస్తున్న అరుణ

కోనరావుపేట(వేములవాడ): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని కనగర్తి ప్రాథమిక పాఠశాలలో మన ఊరు– మన బడి పనులు, వంటగది, కోనరావుపేట పౌర పఠనాలయాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. సర్పంచ్‌లు భారతి, పోకల రేఖ, ఎంపీపీ చంద్రయ్య, ఎంపీటీసీ లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రామ్మోహన్‌రావు, వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కార్యదర్శి కవిత, హెచ్‌ఎం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే..



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న డీఈఓ రమేశ్ తదితరులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్థానిక గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫామ్స్ అందించారు. ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్ ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి గ్రేడింగ్ పాయింట్స్‌తో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచే శ్రీనివాసు, కౌన్సిలర్ దేవదాసు, ఎస్‌ఎంసీ చైర్మన్ కోడం శ్రీధర్, వైస్‌చైర్మన్ ఎలిగేటి రూపిక, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇలా ప్రారంభించి.. అలా మూసేశారు..



ఉదయం ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్



మధ్యాహ్నం మూసి ఉన్న గ్రంథాలయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రజలకు గ్రంథాలయం అందుబాటులోకి వచ్చింది అనే సంతోషం 3 గంటలు కూడా నిలవలేదు. ఉదయం అట్టహాసంగా ప్రారంభించిన గ్రంథాలయం మధ్యాహ్నం వరకు మూసివేడంతో ఇదే విడ్డూరం అని చూసిన వాళ్లు ముక్కున వేలేసుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాత గ్రంథాలయాన్ని గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనిత ప్రారంభించారు. ప్రారంభం అనంతరం వారు మాట్లాడుతూ, గ్రంథాలయం ఎలప్పుడూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఉపన్యాసాలు ఇచ్చారు. కాగా ప్రారంభించి 3 గంటలు కూడా గడవక ముందే గ్రంథాలయం మూసివేసి తాళం వేశారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభం పేరుతో ఫొటోలకు ఫోజులు ఇచ్చి జారుకున్నారని దుయ్యబట్టారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలు



సిద్దూను సన్మానిస్తున్న డీఐఈవో తదితరులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలు తయారవుతున్నాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించగా ప్రతిభ చూపినవారికి బహుమతులు అందించారు. నీట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థి సిద్దూను శాలువ, మెమొంటోతో సత్కరించారు. ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఉచిత విద్యను అందిస్తుందన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆది శ్రీనివాస్, నాయకులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు ఏటా రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నయాపైసా ఇవ్వకుండా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్ తీరుకు నిరసనగా మూడు రోజులుగా డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎనిమిది బెల్లం బుట్టలను ఆలయ ఆవరణలో భక్తులు, పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్నకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని, తెలంగాణకు వాటర్‌హబ్‌గా ఉన్న మిడ్‌మానేరు నిర్వాసితులకు రూ.5.04 లక్షలు చెల్లిస్తామని ప్రకటించి నయాపైసా ఇవ్వలేదన్నారు. భక్తులకు నిధులు కేటాయించి సౌకర్యాలు పెంచాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల కొమురయ్య, పాత సత్యలక్ష్మి, తోట లహరి, కనికరపు రాకేశ్, వంగ పర్శరాములు, వస్తాద్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ చోరీకి యత్నించిన దొంగ అరెస్ట్



పట్టుబడిన దొంగ

సిరిసిల్ల క్రైం/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్‌లో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి ఎస్పీ అఖిల్‌మహాజన్ వివరాలు వెల్లడించారు. మండలంలోని దుమాలకు చెందిన పిల్లి చందు ఎల్లారెడ్డిపేటలో వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వచ్చే అరకొర ఆదాయంతో మద్యం తాగుతూ జల్సా చేసేవాడు. జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీల మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈనేపథ్యంలో ఎల్లారెడ్డిపేటలోని కేడీసీసీ బ్యాంక్‌లోకి ప్రవేశించి వెంట తెచ్చుకున్న హ్యాండ్‌కట్టర్‌తో బ్యాంక్ లాకర్లు తెరవడానికి ప్రయత్నించగా, సాధ్యంపడకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సోమవారం బ్యాంక్ మేనేజర్ సంపూర్ణ ఫిర్యాదు మేరకు సీఐ మొగిలి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి, స్పెషల్ టీమ్ సభ్యులు దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతికతతో దుమాల గ్రామంలోని తన నివాసంలో ఉన్న చందును మంగళవారం అరెస్టు చేశారు. 24 గంటల్లోపే నిందితుడిని పట్టుకున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎండలో నడిసి.. అలసి

- సిద్దిపేట నుంచి నిజామాబాద్‌కు కాలినడక
- సొమ్మసిల్లి పడిపోయిన కూలీ
- చేరదీసిన పోలీసులు



దుర్గయ్యను చేరదీస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కుటుంబానికి బుక్కెడు బువ్వ పెట్టేందుకు ఓ దినసరి కూలీ ఊరి కాని ఊరికి వచ్చి మోసపోయాడు. చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోవడంతో అనారోగ్యానికి గురై.. చివరకు స్వగ్రామానికి బయల్దేరేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కాలినడకన పయనమయ్యాడు. మండే ఎండలకు తోడు కడుపులో ఆసరా లేక పడిపోయిన కూలీని పోలీసులు చేరదీశారు. వివరాలు.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కూలీ మామిండ్ల దుర్గయ్య(45) మంగళవారం ముస్తాబాద్‌లో పడిపోయాడు. గమనించిన కానిస్టేబుల్ చేరాల రాజశేఖర్, దుర్గయ్యను తన వాహనంపై బస్టాండ్‌లో వదిలిపెట్టాడు. గంట తర్వాత కానిస్టేబుల్ రాజశేఖర్ మంత్రి కేటీఆర్ బందోబస్తుకు వెళ్తుండగా ముస్తాబాద్ శివారులో దుర్గయ్య మళ్లీ పడిపోయి ఉండడం గమనించి ఎస్సై వెంకటేశ్వర్లుకు సమాచారం అందించాడు. బాధితుడిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. వివరాలు తెలుసుకుని చలించిపోయారు.

తిండి కరువై.. అనారోగ్యానికి గురై..

నిజామాబాద్‌కు చెందిన దుర్గయ్యను వారం రోజుల క్రితం పని ఉందని ఓ మేస్త్రీ సిద్దిపేటకు తీసుకెళ్లాడు. అక్కడ పని చేసిన డబ్బులు ఇవ్వకపోవడంతో దుర్గయ్యకు తిండి కరువైంది. చివరకు అనారోగ్యానికి గురికావడంతో ఇంటికి వెళ్తానన్నా మేస్త్రీ డబ్బులు ఇవ్వలేదు. దీంతో కాలినడకన నిజామాబాద్‌కు మంగళవారం వేకువజామున బయల్దేరాడు. సిద్దిపేట నుంచి 30 కిలోమీటర్లు నడిచి ముస్తాబాద్ చేరుకున్న దుర్గయ్య ఎండకు పూర్తిగా నీరసించి పోయాడు.కాళ్లకు బొబ్బలు వచ్చాయి. ముస్తాబాద్‌లో రెండుచోట్ల పడిపోయాడు. గమనించిన కానిస్టేబుల్ రాజశేఖర్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించాడు. భోజనం పెట్టించి, రూ.2వేల నగదు ఇచ్చాడు. నిజామాబాద్ వెళ్లే బస్సులో ఎక్కించాడు. మానవతా దృక్పథంతో దుర్గయ్యను ఆదుకున్న కానిస్టేబుల్‌ను సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు, సహచర పీసీలు అభినందించారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



బొప్పాపూర్‌లో మాట్లాడుతున్న శంకరయ్య

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీటీసీ ఉల్లందుల గీతాంజలి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్‌డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, నర్సింహారెడ్డి, సుభాష్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో కలెక్టర్ నిధులతో నిర్మించిన పౌర పఠన కేంద్రాన్ని ప్రారంభించారు. సీఎం కేసీఆర్ అన్ని మండల కేంద్రాల్లో గ్రంథాలయాలను బలోపేతం చేశారన్నారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ మంజుల, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడంలేదని నిరసన



ఫ్లెక్సీని తొలగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పొటో ఎందుకు పెట్టలేదంటూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్సీ లేని ఫ్లెక్సీని తొలగించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డుకుంటామని పేర్కొన్నారు. డీపీఓ రవీందర్‌కు సమస్య వివరించగా, మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుల వెంకటి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



అక్షరాభ్యాసం చేపిస్తున్న ఏజీపీ రవీందర్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బొంపెల్లి రవీందర్‌రావు అన్నారు. మండలంలోని తుర్కపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం బొంపెల్లి లక్ష్మి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్కులు తదితర వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏజీపీ నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తుందని, విద్యాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి తోడ్పాటు అందించాలన్నారు. సర్పంచ్ కాశోల్ల పద్మ, ఉపసర్పంచ్ జవ్వాజి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ బాలలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణప్రసాద్, దుర్గప్రసాద్, రాజు, ప్రభు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.